క్లుప్తంగా

యాత్రికుడికి సన్మానం



తెలకపల్లి: బిహార్‌లోని ముజఫర్‌కు చెందిన యువకుడు రోషన్ స్కేటింగ్‌పై దేశంలోని 12 ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శనానికి బయలుదేరాడు. నేపాల్‌లోని పశుపతి అలయ దర్శనంతో ప్రారంభించి చార్‌ధామ్ యాత్రతో ముగియనున్నది. ఇందులో భాగంగా 84 రోజు యువకుడి యాత్ర ఆదివారం తెలకపల్లికి చేరుకున్నాడు. హిందు సంఘాల నాయకులు యువకుడికి స్వాగతం పలికి సన్మానించారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ చంద్రశేఖర్, విశ్వ హిందు పరిషత్ జిల్లా కార్యదర్శి ఉమాపతి, రవికుమార్, రామకృష్ణ, శివకృష్ణ, హిందు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



కొల్లాపూర్: సిద్దిపేట జిల్లా వెచరేణిలో ఆంజనేయస్వామి దేవాలయంలోకి వెళ్లిన దళిత బాలుడిపై దాడికి పాల్పడి, హింసించిన హిందూ సంఘాల నాయకులపై కేసు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లాపూర్‌లో విలేకరులతో తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు కలమంద శేఖర్‌లు మాట్లాడారు. గుడిలోకి వెళ్లాడని కారణంతో బాలుడిని విచక్షణారహితంగా కొట్టడంతో పాటు బట్టలూడదీసి ఊరేగించడం అమానుషమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమావేశంలో నాయకులు పుట్టపాగ నాగరాజు, జగదీష్, కోళ్ల రాజు తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి మట్టి నమునాల సేకరణ



తాడూరు: మండలంలోని సిర్సవాడ అవతల వైపు పారుతున్న దుందుబీ నదిపై హైలెవల్ వంతెన మంజూరు అయ్యింది. ఇందులో భాగంగా పీఆర్‌ఏఈ శివకృష్ణ ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణ ప్రదేశంలో మట్టి నమూనా సేకరించారు. వర్షాకాలం ప్రారంభంలో పనులు ప్రారంభిస్తేనే రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని నదిపరివాహక గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు. నమూనాలు సేకరించడం పూర్తయిన వెంటనే వంతెనకు సంబంధించి పూర్తి నివేదిక సిద్ధం చేసి టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాన్‌గల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990–91 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని కెఎస్‌ఆర్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు దామోదర్‌రెడ్డి, శివన్న, సూర్యనారాయణ, విజయలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మాందాపూర్‌లో..

మాందాపూర్ ఉన్నత పాఠశాలలో 2005–06 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. దాదాపుగా 20 ఏళ్ల తర్వాత నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు జగదీశ్వర్‌రెడ్డి, మంజుల, మేగారెడ్డి, ప్రసాద్‌రావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణం ఎప్పుడో?



లింగాల నుంచి పద్మన్నపల్లికి వెళ్లే మార్గంలో వాగుపై వంతెన ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం

లింగాల: మండలంలోని పలు మార్గాలలో ఉన్న వాగులపై వంతెనలు లేక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన మార్గాలతో పాటు బైపాస్ మార్గాలలో ఉన్న పలు వాగులు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లింగాల నుంచి పద్మన్నపల్లి బైపాస్ మార్గంలో రెండు వాగులు, అవుసలికుంట నుంచి శాయిన్‌పేట మార్గంలో, అంబట్‌పల్లి నుంచి రాయవరం వెళ్లే మార్గంలో, చెన్నంపల్లి ద్వారా పద్మన్నపల్లి మధ్యలో ఉన్న వాగులపై వంతెనలు నిర్మించాలని పలు మార్లు ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు, పాలకులకు విన్నవించారు. లింగాల నుంచి అప్పాయపల్లి వెళ్లే మార్గంలో చిన్న వాగుపై రూ.80 లక్షలతో చేపట్టిన వంతెన పనులకు బిల్లులు రాక పనులను అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో అప్పాయపల్లి, శ్రీరంగాపూర్ గ్రామాలకు వెళ్లే



చెన్నంపల్లి-పద్మన్నపల్లి వెళ్లే మార్గంలో ప్రమాదభరితంగా ప్రవహిస్తున్న వాగు(ఫైల్)

ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాగులపై వంతెనలు నిర్మించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జిలు నిర్మించాలి



మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న వాగులపై వంతెనలు నిర్మించాలి. వర్షాకాలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. మారుమూల ప్రాంతాల మధ్య ఉన్న వాగులపై వంతెనలు నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మల్లయ్య, రాయవరం

సమస్య పరిష్కరించాలి



వంతెనలు నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగించాలి. సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి. లింగాల నుంచి చెన్నంపల్లి, చెన్నంపల్లి నుంచి పద్మన్నపల్లి వెళ్లే మార్గంలో ప్రమాదభరితంగా ఉన్న వాగులపై వంతెనలు నిర్మించాలి. చిన్న చిన్న కల్వర్టులపై కాజ్‌వేలను ఏర్పాటు చేయాలి.

– రవీందర్‌నాయక్, చెన్నంపల్లి

చర్యలు తీసుకుంటాం

గ్రామాల మధ్య ఉన్న వాగులపై వంతెనలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదనలు పంపించలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పరిశీలించి పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపిస్తాం. ఆయా గ్రామాల ప్రజల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– శ్రీనివాసులు, పీఆర్ ఏఈ, లింగాల

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తిమ్మాజిపేట: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పోతిరెడ్డిపల్లిలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. అంతకుముందు పుల్లగిరిలో బొడ్రాయి పండుగలో పాల్గొన్నారు. అదేవిధంగా మరికల్‌లో కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి తండ్రి మరణించాడు. ఇప్పలపల్లి తండాలో ఇటీవల లైన్‌మెన్ సత్యం మృతి చెందాడు. గుమ్మకొండలో బంగారు అను రైతు మిషన్‌లో చేయికట్ కావడంతో బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, మల్లయ్యగౌడ్, శ్రీనివాస్‌బహదూర్, భాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మాధవులు, హర్షవర్ధన్, భాస్కర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, దామోదర్, రాములు, తిరుపతి, పరుష, జంగిరెడ్డి,జంగుడు పాల్గొన్నారు.

ఘనంగా కోట మైసమ్మ పండుగ

తిమ్మాజిపేట: మండలంలోని పుల్లగిరిలో ఆదివారం నిర్వహించిన కోటమైసమ్మ పండుగలో ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నాడు. స్థానిక యువకులు ఎమ్మెల్యేను శాలువతో ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శిథిలావస్థలో ఆర్టీసీ బస్టాండ్

బల్మూర్: ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రంలో 1999లో నిర్మించిన బస్టాండ్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. లక్షల వ్యయంతో నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ప్రారంభించిన కొన్ని రోజుల మాత్రమే బస్టాండ్ వద్ద బస్సులను నిలిపారు. ఆతర్వాత బస్సు ప్రాంగణంలోకి బస్సులు వచ్చిన దాఖలాలు లేవు. ఆర్టీసీ అధికారులు శ్రద్ధ చూపక పోవడంతోనే బస్టాండ్ అంధకారంగా మారి వీధి కుక్కలు, పందులకు ఆవాసంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. గాంధీచౌరస్తా వద్ద బస్సుల నిలపడంతో అక్కడ ఎండతీవ్రతకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న బల్మూర్ ఆర్టీసీ బస్టాండ్

ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సూచికలు లేని మలుపులు



కుప్పగండ్ల-దొంగరోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



గొల్లోనిపల్లి-చౌదర్‌పల్లి రోడ్డులో సూచిక బోర్డు లేని మలుపు

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల, చౌదర్‌పల్లి రోడ్లలో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. కుప్పగండ్ల నుంచి దొంగరోడ్డుకు వెళ్లే దారిలో ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. అదే విధంగా చౌదర్‌పల్లి నుంచి గొల్లోనిపల్లి సమీపంలో ప్రమాద మలుపు ఉండడంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ రాజ్ అధికారులు ప్రమాద మూలమలుపుల వద్ద సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని వాహన దారులు కోరుతున్నారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్



పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోలు, కొండ్రావ్‌పల్లి రోడ్డు మార్గంలో ట్రాన్సుఫార్మర్ ఏర్పాటు చేశారు. కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డుపక్కన వెళ్లే పశువులు, గేదెలు విద్యుదాఘాతానికి గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. విద్యుత్ అధికారులు పట్టించుకోని ట్రాన్సుఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీపనగండ్ల: మండలంలోని తూంకుంట వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్‌బీ కానిస్టేబుల్ పరశురాముడు తెలిపారు. తూంకుంట గ్రామానికి చెందిన కోళ్ల శేఖర్ యాదవ్ ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రాగా, ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట గ్రామానికి చెందిన సైనికుడు మిద్దె రాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రఘుపతిపేట గ్రామానికి వెళ్లి సైనికుడు మిద్దె రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయకుమార్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకుడు హరీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో ట్యాంక్



లింగాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఓవర్ హెడ్ శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారింది. 45 సంవత్సరాల కిందట ట్యాంక్‌ను నిర్మించారు. మండల కేంద్రంలో 70 శాతం ప్రాంతానికి ఈ ట్యాంక్ నుంచే నీటి సరఫరా చేస్తున్నారు. సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంక్ నిర్వహణ పట్ల శ్రద్ధ చూపక పోవడంతో శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ లోపల, బయట పెచ్చులూడుతోంది. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్‌ను పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా బొడ్రాయి పండుగ



బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి

అచ్చంపేట: పట్టణంలో నిర్వహించిన బొడ్రాయి, పోచమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఆదివారం పట్టణంలో జనసందోహాల మధ్య అంత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం భ్రమరాంబ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక ప్రతిష్ఠ హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దంపతులతో పాటు నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. భ్రమరాంబ ఆలయం, పాతబజారు, ఉట్లకోనేరు, పోచమ్మ గుడి జనసందోహంతో నిండిపోయింది. అనంతరం ఉదయం 10.08 గంటలకు మహా త్రిపుర సుందరి స్వరూపమైన శ్రీతల యంత్ర స్తిత బొడ్రాయి, పోచమ్మ అమ్మవార్ల పున:నిర్మాణం యంత్రబింబి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆడపడుచులు బొడ్రాయికి పూర్ణ కుంభజలంతో అభిషేకం చేశారు. సాయంత్రం మహిళలు అలకంరించిన కుండలతో బొడ్రాయి, పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. రాత్రి 9గంటల నుంచి కోటమైసమ్మ కల్యాణం, గ్రామ పోలివేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా వలంటీర్లను నియమించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ రవీంధర్, ఎస్‌ఐ రమేష్‌లు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీజేపీ నాయకులు పోతుగంటి భరత్‌కుమార్, ఎ.గోపాల్‌రెడ్డి, శ్రీధర్, సతీష్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

తెలకపల్లి: మండల కేంద్రంలో సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ జయంతిని నిర్వహించారు. నాయకులు యాదయ్య, తిరుపతయ్య, శ్రీశైలం, శివకుమార్, కురుమూర్తి స్టాలిన్, రాములు, వేణు ,కేశవులు బుచ్చయ్య రాము తదితరులు పాల్గొన్నారు.



తెలకపల్లిలో నినాదాలు చేస్తున్న నాయకులు

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్: పట్టణంలో సగర సంఘం ఆధ్వర్యంలో 16 వ వార్డులో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఏర్పాటు చేశారు. సగర సంఘం నాయకులు భగీరథుడికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, రాంచంద్రయ్య, రాజశేఖర్, నాగన్న, రవి, కురుమయ్య, రాము, సూర్యప్రకాష్, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని భగీరథ మహర్షీ జయంతి ఉత్సవాల్లో మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. తిరుపతయ్య సాగర్, నేరేడు శంకర్, శివ సాగర్, కురుమయ్యసాగర్, శ్రీరామ్ సాగర్, హుస్సేన్‌సాగర్, రేణయ్య సాగర్ పాల్గొన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్: భగీరథ జయంతి సందర్భంగా కల్వకుర్తి పట్టణంలో సగరులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, బాలు నాయక్, శాన్వాస్ ఖాన్, రాజేందర్, వివేకానంద, భీమయ్య, పడకండి రాజు, దుర్గయ్య, రాకేష్ తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సగరులు



కొల్లాపూర్‌లో ..

పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి

పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు మంజూరు చేయాలని ధర్మసమాజ్ పార్టీ నియోజకవర్గ నాయకురాలు ఆది సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు సూచించిన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ అర్హులైన పేదలను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులను విస్మరిస్తే పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

తెలకపల్లి/బిజినేపల్లి/ఉప్పునుంతల/లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లోని పలు మండలాల్లో 5 నుంచి 19 వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, డ్యాన్స్, ఇండోర్ గేమ్స్, బేసిక్ మ్యాథ్స్ స్కిల్స్, ఆర్ట్, క్రాఫ్ట్ తదితర అంశాలలో శిక్షణ ఇవ్వనునట్లు తెలకపల్లి, బిజినేపల్లి, ఉప్పునుంతల, లింగాల మండలాల ఎంఈఓలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపటి నుంచి రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు

తాడూరు: యువతకు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆయా బ్యాంకుల వారిగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. 6న తాడూరు తెలంగాణ గ్రామీణ బ్యాంకు, 7న నాగర్‌కర్నూల్‌లో ఎస్‌బీఐ బ్యాంకు, 8న ఆవంచ తెలంగాణ గ్రామీణ బ్యాంకు, 9న ఐతోలు ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తునట్లు తెలిపారు. దరఖాస్తు ఫారం ఒక సెట్ జిరాక్సు, ఒరిజినల్ కాపీలు తీసుకురావాలని కోరారు.

శతచండీ యాగానికి ఏర్పాట్లు పూర్తి

తాడూరు: మండల కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించే శతచండీ యాగానికి ఏర్పాట్లు పూర్తి అయినట్లు నిర్వాహకులు రామకృష్ణ శర్మ, అనురూప్ శర్మలు తెలిపారు. సోమవారం ఉదయం నుంచి గోపూజ, రక్ష బంధనం, గురుపూజ, సుస్తివాచనం, మంగళవారం గణపతిపూజ యాగశాల ప్రవేశం, సాయంత్రం ప్రదోశపూజ వంటి కార్యక్రమాలకు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి చేయూత



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని మల్లెలమ్మ దేవాలయ అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి చేయూత అందించారు. ఇటీవల ఆలయాన్ని సందర్శించిన సందర్భంలో ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ మేరకు రూ.2 లక్షలతో ఆలయానికి రంగులు వేయించారు. ఆదివారం ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సుంకిరెడ్డి కృష్టారెడ్డి, సుభాషినిరెడ్డిలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, చంద్రకాంత్ రెడ్డి, శ్రీకాంత్, కమిటీ సభ్యులు లక్ష్మణ్, శివ కుమార్, పరమేశ్వర్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

చారకొండ: మండలంలోని మర్రిపల్లిలో ఆంజనేయస్వామి పున:ప్రారంభంలో భాగంగా ఆదివారం ఆలయంలో గ్రామస్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా గణపతిపూజ, పుణ్యావాచకం, గోపూజ, మండపారాధనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి విగ్రహాన్ని ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించి, అమ్మవారి విగ్రహాలకు ధాన్యాది వాసం ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. విరాళాలు అందించిన దాతలకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి, సత్కరించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు